ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 5 ఆగస్టు 2025



## జాతీయస్థాయి ఘట్కా పోటీలకు నలుగురి ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ ఘట్కా ఎంపికల పోటీలో జిల్లా నుంచి పాల్గొన్న క్రీడాకారుల్లో నలుగురు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని సంఘం జిల్లా అధ్యక్షుడు ఖగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వి.శ్యామసుందర రావు తెలిపారు. ట్రెడిషనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్(సాంప్రదాయ క్రీడలు)కు ఎంపికైన వారిలో బి.భావనశ్రీ, ఐ.యశోధర్, వి.సాహిత్య సౌమ్య, బి.హర్షవర్ధన్ ఉన్నారన్నారు. ఈ పోటీలు సెప్టెంబరు 19 నుంచి 21వ తేదీ వరకు చండీఘడ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో జరుగుతాయని వారు తెలిపారు.

# కలెక్టర్ సారూ.. కంపు కంపు!

శ్రీకాకుళం నగరపాలక సంస్థకు కలెక్టర్ ప్రత్యేకాధికారి. కార్పొరేషన్ పాలకవర్గం లేనందువల్ల ఆయన ఆధ్వర్యంలోనే పాలన నడుస్తుంది. కలెక్టర్‌తో పాటు ఇతర జిల్లా అధికారుల కార్యాలయాలు నగరంలోనే ఉంటాయి. అలాంటి చోట పరిశుభ్రత అధ్వానంగా ఉంది. వీధులు, రోడ్ల పక్కన కాలువలు కంపు కొడుతున్నాయి. ఇక వర్షం వస్తే రోడ్లపైకి మురుగునీరు వస్తుంది. ఇళ్లలోకి కూడా ప్రవేశిస్తుంది. ఇలా ఉంటే వ్యాధులు విజృంభించవా మరి! నగరాన్ని శుభ్రంగా ఉంచండి మహాప్రభో! అంటూ ప్రజలు ఎన్నిసార్లు వేడుకున్నా.. వినతులు ఇచ్చినా ఫలితం లేదు.



నీలమ్మకాలనీ - తోటపాలెం రోడ్డులో అధ్వానంగా మురుగు కాలువ

- శ్రీకాకుళంలో అధ్వానంగా పారిశుధ్యం
- కాలువల్లో పేరుకుపోతున్న పూడిక
- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
- జిల్లా కేంద్రంలోనే అపరిశుభ్రత
- వర్షం వస్తే ఇక్కట్లు అన్నీఇన్నీ కావు

శ్రీకాకుళం అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్టుంది శ్రీకాకుళం నగర పాలక సంస్థ దుస్థితి. మునిసిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా పదేళ్ల కిందట అప్‌గ్రేడ్ చెందినా.. వసతులు మాత్రం మెరుగుపడలేదు. సమస్యలు పరిష్కారం కావడం లేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం శ్రీకాకుళం నగరంలో లక్షమందికిపైగా జనాభా ఉన్నారు. ఈ పద్నాలుగేళ్లలో జనాభా రెట్టింపు అయ్యారు. కానీ ప్రజల అవసరాలకు తగ్గట్టు వసతులు లేవు. ముఖ్యంగా పారిశుధ్యం నిర్వహణ దారుణంగా ఉంది. దశాబ్దాల కిందట నాటి డ్రైనేజీ వ్యవస్థ కొనసాగుతోంది. మురుగు కాలువలు, వాటి మదుములు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో మురుగునీటి ప్రవాహం సరిగ్గా సాగడం లేదు. ప్లాస్టిక్ వ్యర్థాలు, ఖాళీ సీసాలు, చెత్త పేరుకుపోయి ఎక్కడికక్కడ మురుగునీరు కాలువలపై నుంచి రోడ్లపైకి వస్తోంది. దీంతో నగరవాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. జిల్లా కలెక్టర్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా ఉన్నారు. ఆయన ఆధ్వర్యంలోనే పాలన నడవాలి. తరచూ కార్పొరేషన్ అధికారులతో సమావేశమై (మిగతా 6వ పేజీలో..)

### పూర్తికాని శుద్ధిప్లాంట్

శ్రీకాకుళంలో అన్ని ప్రాంతాల కాలువల నుంచి నాగావళి నదిలోకి మురుగు కలుస్తుంది. దీనితో నది కాలుష్యం తగ్గించేందుకు రూ.36 కోట్లతో కొన్నేళ్ల కిందట పొన్నాడ వంతెన వద్ద సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ) పనులు ప్రారంభించారు. కాలువల నుంచి వచ్చే మురుగు నీటిని ఎస్‌టీపీలోకి చేర్చి అక్కడ ఆ నీటిని శుద్ధి చేసి అనంతరం నాగావళి నదిలోకి వదిలేందుకు ప్రణాళిక రచించారు. అమృత్ నిధులతో చేపట్టిన ఈ పనులు ఏడాది నుంచి నిలిపేశారు. దీనితో మురుగు నేరుగా నదిలోకి కలుస్తోంది. ఇప్పటికైనా ఎస్‌టీపీ పనులు పూర్తి చేయాలని, ప్రధాన జంక్షన్ల వద్ద ఉన్న కాలువల్లో పూడిక తొలగించాలని నగర ప్రజలు కోరుతున్నారు. పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పొన్నాడ వంతెన వద్ద సగంలో నిలిచిన ఎస్‌టీపీ ప్లాంట్ పనులు

---

**మేధస్సుకు పరీక్ష**
- విద్యార్థులకు జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష
- 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' దరఖాస్తుకు అవకాశం
- ఆరో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు..
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబరు 30వరకు గడువు

6లో

**జేఎల్‌పీఎం పూర్తికి ప్రత్యేక డ్రైవ్**
- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

6లో

**ఆపరేషన్ సిందూర్ వైఫల్యాన్ని మోదీ అంగీకరించాలి**
- ట్రంప్ పాదాల చెంత వీర సైనికుల త్యాగాలు: కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి

7లో

**27 నెలలుగా సీఆర్పీ గైర్హాజరు**
- లోలుగు క్లస్టర్ పాఠశాలలకు ఇబ్బందులు

7లో

**మొరాయిస్తున్న ఫోన్లతో పనిచేయలేం**
- మాన్యువల్‌గానే సరుకులు పంపిణీ చేస్తాం
- అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

8లో

---



వరిశ హరిప్రసాద్, రామారావుతో మాట్లాడుతున్న దువ్వాడ శ్రీధర్, బళ్ల గిరిబాబు

## మంత్రి సీదిరి వ్యతిరేకులంతా.. ఒక్కటయ్యేలా..

పలాస, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వైసీపీలో మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు వ్యతిరేకంగా ఉన్న నాయకులందర్నీ ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు ఆ పార్టీ అసంతృప్తి నేతలంతా విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు, వైసీపీ నేత వరిశ హరిప్రసాద్ నివాసానికి సోమవారం మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీకాంత్ తమ బృందంతో కలిసి వెళ్లారు. పెదంచలలోని హరిప్రసాద్‌తో పాటు సోదరుడు స్థానిక సర్పంచ్ వరిశ రామారావును మాజీమంత్రి సీదిరి వ్యతిరేకవర్గం కలుసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. పలాస-కాశీబుగ్గ నియోజకవర్గంలోని అన్నీ గ్రామాల్లో మాజీమంత్రికి వ్యతిరేకంగా ఉన్న వారందర్నీ కలుస్తూ మద్దతు కూడగట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. వీరివెంట వైసీపీ నాయకులు గొర్లె వేణుగోపాల్, మరడ భాస్కరరెడ్డి, డబ్బీరు నాగభూషణరావు ఉన్నారు.

---

రణస్థలంలోని ఓ కల్యాణ మండపంలో సెట్



# నాటి సందడి లేదు మరి!

- ఖర్చు పెరిగింది.. ఆ వేడుకల్లేవు
- గతంలో మూడు రోజుల పెళ్లి
- చెట్టు కొమ్మలతో వివాహ వేదిక
- అంతా సాంప్రదాయబద్ధంగానే..
- ఇప్పుడేమో అంతా ఈవెంట్‌లాగా..
- గంటల్లోనే ముగుస్తున్న తంతు

రణస్థలం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం వేళ.. జిల్లాలో జోరుగా వివాహాలు జరుగుతున్నాయి. వేలాది జంటలు ఒక్కటవుతున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా వివాహ వేడుకల్లో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గతంలో మూడు రోజుల పెళ్లి ముచ్చటైన పెళ్లి అన్నట్టు ఉండేది. మూడు రోజులు ముందుగానే వివాహ వేడుకల సన్నాహాలు ప్రారంభమయ్యేవి. బంధువుల రాకతో ఇల్లు కళకళలాడేది. కానీ ప్రస్తుతం తక్కువ సమయంలో గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోవడానికి ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు. నూతన పోకడలతో ఖర్చు భారీగా పెరిగినా.. నాటి సందడి మాత్రం కనిపించడం లేదని కొంతమంది పెద్దలు పేర్కొంటున్నారు.

**● పందిళ్ల స్థానంలో స్టేజీలు..**

గతంలో కొబ్బరికమ్మలు, పచ్చని చెట్టుకొమ్మలతో పెళ్లి పందిరి ఏర్పాటు చేసేవారు. ఆవు పేడతో అలికిన మండపం సిద్ధం చేసేవారు. అలా చేస్తే వధూవరుల జీవితం పచ్చగా ఉంటుందని నమ్మకం. చీడపీడలు, ఎటువంటి రుగ్మతలు దరిచేరవని భావించేవారు. కానీ ఇప్పుడంతా రెడీమేడ్ పందిళ్లు, మండపాలు వచ్చేశాయి. గంటల వ్యవధిలో మండపాలను సిద్ధం చేస్తున్నారు. పచ్చని పందిళ్ల బదులు విద్యుత్ దీపకాంతులతో స్టేజీలు అలంకరిస్తున్నారు.



**● విస్తరిస్తున్న హల్దీ సంస్కృతి...**

వివాహ వేడుకల్లో హల్దీ ఫంక్షన్ సంస్కృతి శరవేగంగా విస్తరిస్తోంది. ఉత్తరాది రాష్ట్రాల్లో మార్వాడీల్లో ఈ సంస్కృతి అధికంగా ఉండేది. వివాహ వేడుకల్లో భాగంగా అందరూ ఒకేరకమైన దుస్తులు ధరించడం, వధూవరులకు సుగంధ ద్రవ్యాలు, పూలతో కూడిన నీటితో స్నానం చేయించడం, ముందురోజు బంధువులంతా డ్యాన్స్‌లు చేయడం ఉత్తరాదిన ఉండేది. ఇప్పుడు మన జిల్లాలో కూడా ఈ సంస్కృతి విస్తరిస్తోంది. పల్లెలకు సైతం పాకుతోంది.

**● ఫొటోషూట్‌కు ప్రాధాన్యం**

వైవాహిక జీవితానికి సంబంధించి తొలి వేడుక పది కాలాలపాటు గుర్తుండేలా ఫొటోషూట్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ముందుగా ప్రీ వెడ్డింగ్ షూట్ చేస్తున్నారు. తొలుత నగరాల్లో ఉన్న ఈ సంస్కృతి పట్టణాలకు, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. జిల్లాలో సుదీర సముద్ర తీర ప్రాంతం (మిగతా 6వ పేజీలో..)

---

## భూమి ఆక్రమణకు గురైందని..

- గ్రీవెన్స్ వద్ద వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం
- అప్రమత్తమైన పోలీసులు
- గడ్డిమందు సీసా స్వాధీనం
- సమస్య పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): భూమి ఆక్రమణకు గురైందనే ఆవేదనతో ఓ వృద్ధురాలు 'మీ-కోసం' వేదికగా నిర్వహించే గ్రీవెన్స్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గడ్డిమందు సీసాను వెంట తెచ్చుకోగా.. పోలీసులు అప్రమత్తమై దానిని స్వాధీనం చేసుకున్నారు. కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా.. సమస్య పరిష్కరిస్తానని నేరుగా ఆయన హామీ ఇవ్వడంతో వృద్ధురాలు ఊరట చెందింది. వివరాల్లోకి వెళితే..

కొత్తూరులోని గాజులవీధికి చెందిన పోగిరి అన్నపూర్ణమ్మ 79 ఏళ్ల వృద్ధురాలు. భర్త చనిపోయాడు. ఇద్దరు కుమారులు బతుకుదెరువు కోసం దూర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఆమె మాత్రం స్వగ్రామంలో ఒంటరిగా కాలం వెల్లదీస్తోంది. ఆ వృద్ధురాలికి చెందిన భూమిని ఓ ఆసామి తనదంటూ ఆక్రమించుకున్నాడు. తనకు న్యాయం చేయాలని సచివాలయం, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ రెండేళ్లపాటు తిరిగింది. అయినా ఫలితం లేకపోవడంతో చివరిగా కలెక్టర్‌ను కలిసి తమ గోడుచెప్పాలనుకుంది. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే తన జీవితాన్ని ముగించాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు సంచిలో గడ్డిమందు సీసాను తెచ్చుకుని.. సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీలో నిర్వహించిన 'మీ-కోసం' గ్రీవెన్స్‌కు వచ్చింది. గ్రీవెన్స్ ప్రవేశ ద్వారం వద్ద ఒకటో పట్టణ ఏఎస్‌ఐ పీఏ నాయుడు, సిబ్బంది, బీడీ టీం ఆమెను పరిశీలించగా గడ్డిమందు సీసా కనిపించింది. ఆ సీసాను స్వాధీనం చేసుకున్నారు. దానిపై ఆరా తీయగా.. తన భూమి ఆక్రమణకు గురైందని ఆవేదన వ్యక్తం చేసింది. న్యాయం జరగకపోతే చనిపోవాలని నిర్ణయించుకున్నానని తెలిపింది. దీంతో వారు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. కలెక్టర్ వృద్ధురాలి వద్దకు వచ్చి.. గోడు విని.. సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



అన్నపూర్ణమ్మతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

## వినతుల వెల్లువ

- అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేదు: కలెక్టర్ స్వప్నిల్ దినకర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ సమావేశంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల ఫిర్యాదుల వేదిక.. 'మీ-కోసం' కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 140 మంది వివిధ సమస్యలపై అధికారులకు వినతులను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యానికి తావు లేదని స్పష్టం చేసారు. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపించాలని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ బి.పద్మావతి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### 6 నెలలుగా బిల్లులు, జీతాలు లేవు

- ఆదుకోవాలని మధ్యాహ్న భోజన కార్మికుల వేడుకోలు

'కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన నిర్వహణకు సంబంధించి ఆరు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడు నెలలుగా జీతాలు కూడా చెల్లించడం లేదు' మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు, జీతాలు చెల్లించకపోతే నిర్వహణ ఎలా చేయగలమని వాపోయారు. సమస్యను పరిష్కరించి తమను ఆదుకోవాలని కోరుతూ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.



### పింఛను ఆపేశారు.. ఎలా బతికేది?

- దివ్యాంగ వృద్ధురాలి ఆవేదన

కొత్తూరు మండలం నేరడి గ్రామానికి చెందిన **మంగి లక్ష్మీనారాయణమ్మ**. దివ్యాంగ వృద్ధురాలు. మంచానికే పరిమితమై.. మాట్లాడలేని పరిస్థితి. 79శాతం వికలాంగ ధ్రువపత్రం ఉన్న ఈమెకు గతంలో దివ్యాంగ పింఛన్ అందేది. కానీ ఏమైందో.. పింఛన్ నిలిచిపోయింది. భర్త కూడా వృద్ధాప్యంతో పనిచేయలేని పరిస్థితి. దీంతో ఆ దంపతులిద్దరూ సోమవారం గ్రీవెన్స్‌కు చేరుకున్నారు. పింఛన్ లేకపోతే తాము ఎలా బతికేదని, డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని పింఛన్ పునరుద్ధరించాలని లక్ష్మీనారాయణమ్మ సైగలతో అధికారులను వేడుకున్నారు.



# మేధస్సుకు పరీక్ష



- విద్యార్థులకు జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష
- శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేలా కేంద్రం ప్రోత్సాహం
- ఆరో తరగతి నుంచి చిట్టి శాస్త్రవేత్తల తయారీకి సిద్ధం
- 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' దరఖాస్తుకు అవకాశం
- ఆరో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు..
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబరు 30వరకు గడువు
- ప్రతిభ చూపితే జాతీయ పరిశోధనసంస్థల్లో ఇంటర్న్‌షిప్

నరసన్నపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణల వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. వారిలో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నాయి. పాఠశాలస్థాయి నుంచి పరిశోధనల్లో రాణించేలా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పేరుతో జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తోంది. కేంద్రప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పరీక్షను ఎన్‌సీఈఆర్టీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, విజ్ఞాన భారతి సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఆరోతరగతి నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న వారు ఈ పరీక్ష రాయొచ్చు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు దేశ ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్, ఉపకారవేతనాలు పొందే అవకాశం ఉంటుంది.

### సెప్టెంబరు 30 వరకు రిజిస్ట్రేషన్

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ప్రవేశ పరీక్షలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈఏడాది ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. సెప్టెంబరు 30 వరకు గడువు ఉంది. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్ష జరిగే రోజు విద్యార్థులు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్, లాప్‌టాప్, డెస్క్‌టాప్, డిజిటల్ పరికరాల్లో ఏదైనా ఒకదాని ద్వారా పరీక్షకు నిర్దేశించిన దరఖాస్తును ప్లేస్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలి. ఇలా ఇంటి నుంచే పరీక్ష రాసే అవకాశం ఉంది.

### వంద మార్కులకు పరీక్ష

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. లెవెల్-1 ప్రధాన పరీక్షలో ఆయా తరగతులకు సంబంధించిన వంద ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున వంద మార్కులు కేటాయిస్తారు. సెక్షన్-ఎలో విజ్ఞాన్‌శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషిపై 20 ప్రశ్నలు, సత్యేంద్రనాథ్‌బోస్ జీవిత చరిత్ర నుంచి 20 ప్రశ్నలు, సెక్షన్- బిలో 6 నుంచి 11 తరగతులకు సంబంధించి విద్యార్థులకు గణితం, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బయోలజీ సబ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు, లాజిక్, రీజనింగ్‌కు సంబంధించి 10ప్రశ్నలు ఉంటాయి. మొదటి విభాగంలో ఉత్తీర్ణులైన వారికి లెవెల్-2 పరీక్షల్లో 50 ప్రశ్నలు వంద మార్కులకు ఉంటాయి.

### రాష్ట్రస్థాయికి ఎంపిక చేసేదిలా..

పాఠశాల స్థాయిలో ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 25 మందిని ఎంపిక చేస్తారు. 6 నుంచి 11 తరగతులకుగాను మొత్తం 150 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. ఇందులో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 18 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయి పరీక్ష డిసెంబరు 21, 28 తేదీల్లోగానీ జనవరి 4న గానీ ఏదో ఒక రోజు రాయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయిలో ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలతోపాటు మెమెంటో, సర్టిఫికెట్‌ను అందజేస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి మెమెంటో, ప్రశంసాపత్రం ఇస్తారు.

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక ఇలా..

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యారుల వంతున 12 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతీ తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల చొప్పున 18 మందిని జాతీయస్థాయి విజేతులుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రతమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.20వేలు, తృతీయ బహుమతిగా రూ.15వేలు తోపాటు మెమెంటో, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. నెలకు రూ. 2వేల చొప్పున సంవత్సరంపాటు భాస్కర ఉపకార వేతనం కింద రూ.24వేలు అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2025-26లో జాతీయ, జోనల్‌స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్డీవో, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్సీ తదితర ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో ఒకటి నుంచి మూడు వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తారు.

### దరఖాస్తు ఇలా చేసుకోవచ్చు

విద్యార్థులు వ్యక్తిగతంగా, అలాగే పాఠశాల నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. పరీక్ష రాసేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ. వివిఎం.ఓఆర్‌జి.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలి. విద్యార్థుల వివరాలను నమోదు చేసిన తరువాత రూ.200 ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ దరఖాస్తును పూర్తి చేయాలి.

### రెండు విభాగాల్లో పరీక్ష..

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6వ తరగతి నుంచి 11వ తరగతి వరకు విడివిడిగా ఉంటాయి. హిందీ, ఇంగ్లీషు భాషలతో ప్రాంతీయ భాషల్లోనూ పరీక్ష రాసేందుకు వెసులుబాటు ఉంది. మన విద్యార్థులు తెలుగు లేదా ఆంగ్లంలో రాయవచ్చు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్షకు సంబంధించి సెప్టెంబరు 1 నుంచి మాక్ పరీక్షలు నిర్వహిస్తారు. పాఠశాల స్థాయిలో ప్రధాన పరీక్ష అక్టోబరు 28 నుంచి 30 వరకు జరుగుతుంది. ఈస్థాయిలో ఉత్తీర్ణులైన వారికి లెవెల్-2 ద్వితీయ పరీక్షను ఆన్‌లైన్‌లో ప్రోక్టరింగ్ విధానంలో పరిశీలకుల సమక్షంలో నవంబరు 19న జరుపుతారు. ఆయా పరీక్షలను ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటలు మధ్య 90 నిమిషాల వ్యవధిలో రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే ప్రతి విద్యార్థి యాప్‌లో ఒక్కసారి మాత్రమే లాగిన్ అవుతారు.



### సృజనాత్మకతను వెలికి తీయొచ్చు



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజన్మాత్మకతను వెలికితీసేందుకు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ చక్కటి వేదికగా నిలుస్తుంది. సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందిండంతో పాటు వారిని శాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈకార్యాక్రమం చేపట్టింది.

**- ఎన్.కుమార్‌స్వామి, జిల్లా సైన్సు అధికారి, శ్రీకాకుళం**

### విద్యార్థులకు అవగాహన కల్పించాలి



భావితరానికి శాస్త్రవేత్తలను తయారు చేసేందుకు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ మంచి వేదికగా మారుతుంది. దీనిపై పట్టణాల్లో తప్ప గ్రామీణ ప్రాంతాల్లో అంత అవగాహన లేదు. జిల్లా సైన్సు ఫోరం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఈ పరీక్షపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తాం. దేశంలో పేరుగల ఇస్రో, డీఆర్‌డీవో, సీఎస్ఐఆర్ వంటి పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేయడం గొప్ప అవకాశం.

**- ఎస్.సాయి శ్రీనివాస శర్మ, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం నాయకులు, నరసన్నపేట**

# శివారు భూములకు కళింగదల్ నీరు

- ఎమ్మెల్యే గౌతు శిరీష

హరిపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): శివారు భూములకు కళింగదల్ నుంచి సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలం బుడార్సింగి వద్ద కళింగదల్ రిజర్వాయర్‌కు సోమవారం జలహారతిని అందించారు. అనంతరం సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షులు బావన దుర్యోధన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి చేయికీ పని... ప్రతి చేనుకు నీరు ఇచ్చే లక్ష్యంలో భాగంగా ఇప్పటికే కాలువులు శుభ్రం చేశామని చెప్పారు. ప్రతి సెంటు భూమికి నీరందించి పంటలు బాగా పండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. విత్తనం వేసిన నుంచి పంట అమ్ముకునే వరకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు నీటి ప్రాజెక్టులను గాలికొదేలిసిందని... దీంతో సాగునీటి నుంచి పంట అమ్ముకునే వరకు అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. అనంతరం మందస పీహెచ్‌సీని సందర్శించి సకాలంలో రోగులకు సేవలందించాలని వైద్యులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్, రట్టి లింగరాజు, బమ్మిడి కర్రయ్య, తమిరి భాస్కరరావు, సాలిన మాధవరావు, రమ్ము బెహరా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కళింగదల్ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

# వంగపండు సాహిత్యం దోపిడీ వ్యవస్థపై బాణం



వంగపండు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉరసం సభ్యులు

పలాస రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రజాకవి వంగపండు సాహిత్యం దోపిడీ వ్యవస్థపై ఎక్కుపెట్టిన బాణం వంటిదని ఉద్దానం రచయితల సంఘం (ఉరసం) ముఖ్య సలహాదారు డాక్టర్ కుమార్‌నాయక్ అన్నారు. మాకన్నపల్లి గ్రామంలో సోమవారం ఉద్దానం రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రజాకవి వంగపండు ప్రసాదరావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ నాయక్ మాట్లాడుతూ 400కు పైగా జానపద గీతాలను రచించిన వంగపండు బడుగువర్గాలు, గిరిజనులను చైతన్యపర్చారని ఉర్రూతలూగించే గీతాలతో ప్రజల్లో గుర్తుండి పోయారన్నారు. అనంతరం వంగపండు చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన రచించిన గీతాలను సభ్యులు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఉరసం సభ్యులు కుత్తుమ వినోద్, వంకల రాజారావు, సైని మోహనరావు, దాసరి దానేసు, వంకల అప్పారావు, కె.ముకుందరావు, దుర్గాప్రసాద్, పి.వెంకటేష్, సైని అక్షయ్‌కుమార్, బత్తిని జగదీష్ పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధిపై వీడియో పోటీలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ఇన్‌ఫ్లుయెన్సర్లతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా ఏర్పాటైన 75 ఏళ్లు అయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా జిల్లా ప్రత్యేకతలు, అభివృద్ధిపై సమగ్ర అవగాహన కల్పించే వీడియోల పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. జిల్లా అభివృద్ధి, సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రను ప్రతిబింబించేలా ల్యాండ్ స్కేప్ ఫార్మాట్‌లో ముడు నిమిషాల నిడివి ఉన్న వీడియోను రూపొందించాలని సూచిం చారు. వీడియోలను ఆగస్టు 9వ తేదీ ఉదయం 11 గంటల్లోగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్‌కు మెయిల్ ద్వారా పంపించాల న్నారు. ప్రథమ బహుమతి రూ.25 వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు, మూడవ బహుమతి రూ.10 వేలు అంద జేస్తామన్నారు. యువతీ యువకులు పాల్గొని జిల్లా కీర్తిపై వీడియోలు రూపొందించాలని కోరారు.

# కలెక్టర్ సారూ.. కంపు కంపు!



పాలిటెక్నిక్ కళాశాల రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపాన డ్రైన్ సరిగా లేక రోడ్డుపై చేరిన మురుగునీరు

(ఐదో పేజీ తరువాయి)

పర్యవేక్షించాలి. కానీ ఆయన ప్రత్యేకాధికారిగా ఉన్న నగరం ఇలా అపరిశుభ్రంగా తయారు కావడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలాగే నగరం నుంచి ఎమ్మెల్యేగా గొండు శంకర్ ఉన్నారు. ఆయన కూడా తరచూ నగరంలో తిరుతుంటారు. తమ కష్టాలు ఎమ్మెల్యే అయినా పట్టించుకోవా లని ప్రజలు కోరుతున్నారు.

### ఎక్కడ చూసినా.. అదే దుస్థితి

శ్రీకాకుళంలో ఆర్టీసీ కాంప్లెక్స్, మిర్తిబట్టి, పాలకొండ రోడ్డు, ప్రధాన మెయిన్‌రోడ్డు, డేఅండ్‌నైట్ జంక్షన్, అరసవల్లి రోడ్డు, 80అడుగుల రోడ్డు, రామలక్ష్మణ జంక్షన్, ఇలా 14ప్రధాన ప్రాంతాల్లో ఉన్న మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోతోంది. దీంతో చిన్న వర్షం పడినా మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఎప్పుడూ వర్షపునీరు నిలిచిపోతుంటుంది. కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు మురుగు నీరు ప్రవాహానికి ప్రతిబంధకాలుగా మారాయి. అలాగే నీలమ్మ కాలనీ నుంచి తోటపాలెం వెళ్లే రోడ్డులో మురుగు కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే రోడ్డులో కూడా కా లువ సరిగా లేక.. రోడ్డుపై మురుగునీరు నిలిచిపోతోంది. కోడిరామ్మూర్తి స్టేడియం వద్ద కాలువ నుంచి మురుగునీరు.. రోడ్డుపై ప్రవహించి గుంతల్లో చేరుతోంది. శాంతినగర్ కాలనీలోనూ ఇదే పరిస్థితి. ఇలా నగరంలో ఏ వీధి చూసినా ఇదే దుస్థితి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పుడప్పుడూ కాలువల్లో ఉన్న చెత్తాచెదారాలు తొలగిస్తున్నారు. కానీ వారం రోజుల తర్వాత పరిస్థితి షరామామూలుగానే మారుతోందని నగర ప్రజలు వాపోతున్నారు.

# జేఎల్‌పీఎం పూర్తికి ప్రత్యేక డ్రైవ్

- జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్





మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రీ సర్వే పనులను వేగవంతం చేయాలని, ప్రత్యేకంగా జాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (జేఎల్‌పీఎం) పూర్తి చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీ సర్వే రెండో విడతకు ఎంపికైన 49 గ్రామాల్లో నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే పూర్తయిన గ్రామాల్లో తలెత్తిన సమస్యలను పరిగణనలోకి తీసుకుని మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రీసర్వేలో పెండింగ్ దరఖాస్తులు, పీజీఆర్ఎస్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని, మూడో దశలో మిగిలిన గ్రామ, ప్రభుత్వ భూములకు సరిహద్దులను సెప్టెంబరు 30లోగా నిర్ణయించాలని సూచించారు. జాయింట్ ఎల్‌పీఎంల సమస్యను రూ.50లతో పరిష్కరించే అవకాశం ఉందని, ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏడీ వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్



మహిళా డిగ్రీ కళాశాల వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న వన్‌టౌన్ ఎస్ఐ

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పోలీసులు, శక్తిటీం సిబ్బంది సోమవారం విద్యాసంస్థల పరిసరాల్లో పెట్రోలింగ్ నిర్వహించారు. కళాశాల పరిధిలోని దుకాణాలు, పాన్‌షాప్‌ల్లోనూ పొగాకు ఉత్పత్తులు, గంజాయి విక్రయాలు జరుగుతున్నాయా? అని ఆరా తీశారు. వాహనాల తనిఖీ చేపట్టి ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు.

# ఆదిత్యుని ఆదాయం రూ.70.66 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

అరసవల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అరసవల్లి ఆదిత్యుని హుండీల లెక్కింపు సోమవారం ఆలయ అనివెట్టి మండపంలో ఈవో కేఎన్ వీడీవీ ప్రసాద్, ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించారు. రూ.70,66,265 ఆదాయం వచ్చింది. ఇందులో నగదు రూపంలో రూ.66,94,348, చిల్లర రూ.3,71,917 వచ్చాయి. లభించాయి. 23 గ్రాములు బంగారం, 2 కేజీల 380 గ్రాముల వెండి, యుఏఈ దీనార్స్ 10, సింగపూర్ డాలర్లు10, యూఎస్ డాలర్స్ 135 వచ్చినట్లు ఈవో ప్రసాద్ తెలిపారు.

# నాటి సందడి లేదు మరి!

(ఐదో పేజీ తరువాయి)

ఉంది. ఆపై పర్యాటక ప్రాంతాలు సైతం ఉన్నాయి. పెళ్లిళ్ల సీజన్ వస్తే చాలు.. ఈ పర్యాటక ప్రాంతాల్లో ప్రీ వెడ్డింగ్ షూట్‌లు ఎక్కువగా జరుగుతుంటాయి. అనేక రకాల కెమెరాలు, ఇతర పరికరాలు, ప్రత్యేక యాప్‌లు అందుబాటులోకి రావడంతో వీడియోలు, ఫొటోలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. వాటిని సామాజిక మాధ్యమాల ద్వారా పంపించి.. బంధువులు, స్నేహితులను తమ వివాహానికి ఆహ్వానిస్తున్నారు.

### ఏఐతో దివి నుంచి భువికి..

ఇటీవల ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విధానం అందుబాటులోకి వచ్చిన తరువాత వివాహాలు, శుభకార్యాల్లో భావోద్వేగాలు కనిపిస్తున్నాయి. చాలా ఇళ్లలో చనిపోయిన ఇంటి పెద్దలు ఉంటారు. వారితో వధూవరులకు విడదీయరాని బంధం ఉంటుంది. అందుకే వారిని జ్ఞప్తికి తెచ్చేలా వారి ఫొటోలతో కూడిన వీడియోలు ఏఐ ద్వారా రూపొందిస్తున్నారు. వివాహ వేడుకల్లో భారీ స్క్రీన్లపై ప్రదర్శించి చనిపోయిన వారు వచ్చి ఆశీర్వదించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుత వివాహ వేడుకల్లో ఇదో నయా ట్రెండ్.

### అన్ని పనులు ఒక్కరే...

వివాహ వేడుకలకు సంబంధించి ఈవెంట్ సంస్కృతి కూడా జిల్లాకు ఎక్కువగా పాకింది. సాధారణంగా గతంలో మైక్‌సెట్‌తో పాటు వివాహ పందిరి డెకరేషన్ ఒకరు చూసేవారు. వీడియోగ్రాఫర్, ఫొటోగ్రాఫర్ ఉండేవారు. భోజనాల తయారీకి సంబంధించి సామగ్రి పంపిణీ చేసే వారుండేవారు. ఆపై దక్షిణాది సన్నాయి మేళం, వంటవారు, కేటరింగ్ చేసేవారు వేర్వేరుగా ఉండేవారు. కానీ ఇప్పుడు ఈవెంట్ సంస్కృతి జిల్లాలో ప్రవేశించింది. అన్ని పనులు చేసి పెట్టే ఈవెంట్ మేనేజర్లు, సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. ఫలానా కళ్యాణమండపం, ఖాళీ స్థలం చూపిస్తే చాలు.. అన్నిరకాల సేవలు సదరు ఈవెంట్ సంస్థ చూసుకుంటుంది. కాంట్రాక్ట్ తీసుకుని.. పెళ్లి చేసే కుటుంబ సభ్యులకు ఒత్తిడి లేకుండా వేడుకలు పూర్తి చేస్తుంది.

- వివాహ వ్యవస్థలో మార్పులు పుణ్యమా అని ఉపాధి మార్గాలు పెరుగుతున్నాయి. ఒక పెళ్లి ఖర్చు రూ.10లక్షలు అయితే.. దాదాపు ఓ 100మంది వరకూ ఉపాధి దొరుకుతోంది. ఇది సంతోషించదగ్గ విషయమే. కానీ, కొత్త విధానాలతో ఖర్చు పెరిగినా.. ఆనాటి చలువ పందిళ్లు, సన్నాయి వాయిద్యాలు, రోజుల తరబడి ఉండే బంధువుల సందడి ఇప్పుడు కనిపించడం లేదని కొంతమంది పెద్దలు పేర్కొంటున్నారు. నాటి ఆప్యాయతలు తగ్గాయని వాపోతున్నారు. ప్రస్తుతం సౌకర్యం తప్ప.. అప్పట్లో ఉన్నంత ఆనందం లేదని చెబుతున్నారు. నాటి మూడురోజుల పెళ్లి.. నేడు ఒక్కరోజులోని కొన్ని గంటలకే పరిమితమవుతోందని పేర్కొంటున్నారు.

### తీరు మారాలి..

వివాహం అనేది అలుమగల జీవితంలో తొలి పండుగ. గతంలో పెళ్లి అంటే మూడురోజుల పాటు జరిగేది. కానీ ఇప్పుడు ఒక్కరోజులోనే తతంగం ముగుస్తోంది. నాడు పచ్చని చలువ పందిళ్ల కింద.. భాజాభజంత్రీలతో వివాహాలు జరిగేవి. కానీ ఇప్పుడు ఏదో ఒక సినిమా ఈవెంట్ మాదిరిగా జరిగిపోతున్నాయి. ఈ తీరులో మార్పు రావాలి.

**- జి.మధు, పురోహితుడు, రణస్థలం**

### ఊరంతా సందడే..

30ఏళ్ల కిందట వివాహాలు అంటే ఆ ఇంట్లోనే కాదు. ఊరంతా సందడి ఉండేది. ఇల్లు బంధుమిత్రులతో కళకళలాడేది. దగ్గర బంధువులైతే నాలుగైదు రోజుల ముందే వచ్చేవారు. కానీ ఇప్పుడు పెళ్లి రోజు వస్తున్నారు. కొద్ది గంటల పాటు ఉండి వెళ్లిపోతున్నారు. పెళ్లిళ్లు ఖరీదైన వస్తువులుగా మారిపోయాయి. కానీ ఎటువంటి ఆనందం కూడా ఇవ్వడం లేదు.

**- డి.సత్తిబాబు, రణస్థలం**

## టీడీపీతోనే తెలుగుజాతికి గుర్తింపు: రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ఆమదాలవలస, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీతోనే ప్రపంచ వ్యాప్తంగా తెలుగుజాతికి గుర్తింపు లభించిందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన సోమవారం బోస్టన్ నగరంలో టీడీపీ ఎన్నారై విభాగం నిర్వహించిన తెలుగు కమ్యూనిటీ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగుతోందన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తమైందన్నారు. ప్రస్తుతం రాష్ట్రం అభివృద్ధిపథంలో పయనిస్తోందని, ఇదే అభివృద్ధి కొనసాగాలంటే 2029 ఎన్నికల్లో కూడా విజ్ఞులు మళ్లీ టీడీపీని గెలిపించి చంద్రబాబుకు పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఎన్ఆర్ఐలు పాల్గొన్నారు.

## యోగా పోటీ విజేతలకు అభినందన



శ్రీకాంత్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే

ఇచ్ఛాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో ఇచ్ఛాపురానికి చెందిన శ్రీకాంత్ మహంతి, సాయి జగదీష్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శ్రీకాంత్ మహంతి 28-35 సంవత్సరాల విభాగంలో ట్రెడిషనల్, ట్విస్టింగ్ ఆసనాల్లో విజేతగా నిలిచాడు. 14-18 సంవత్సరాల విభాగంలో పి.సాయిజగదీష్ ట్రెడిషనల్ ఆసనాల్లో ప్రథమ, ట్విస్టింగ్ విభాగంలో ద్వితీయ స్థానం పొందారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్ రామయ్యపుట్టుగలో జ్ఞాపికలు అందించి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

### ఆటో యూనియన్ కార్యవర్గానికి..

ఇచ్ఛాపురం బీఎస్ఎస్ ఆటో యూనియన్ నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే బెందాళం అశోక్ సోమవారం రామయ్యపుట్టుగలోని పార్టీ కార్యాలయంలో అభినందించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి, ఆటో యూనియన్ అధ్యక్షుడు నీలాపు ప్రకాష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్.మాధవరెడ్డి, సెక్రటరీ కె.తులసీ, ట్రెజరర్ మధు, జాయింట్ సెక్రటరీ పీసీ సాహు తదితరులున్నారు.

## హైకోర్టు నూతన న్యాయమూర్తికి అభినందన



హైకోర్టు నూతన న్యాయమూర్తి జస్టిస్ తుహిన్‌కుమార్‌కు బొకే ఇస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం లీగల్ ఆగస్టు 4(ఆంధ్ర జ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు నూతన న్యాయ మూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ గేదెల తుహిన్ కుమార్‌ను సోమవారం శ్రీకాకుళం జిల్లా కోర్టు న్యాయవాదులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. జిల్లాలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు గేదెల వాసుదేవరావు, మామిడి క్రాంతి, వాన కృష్ణచంద్, సామంతుల దామోదరరావు, కిమిడి రామి నాయుడు, రౌతు అన్నాజీరావు తదితరులు న్యాయమూర్తిని కలిసిన వారిలో ఉన్నారు.

## సాంకేతిక నైపుణ్యంతోనే మెరుగైన ఉపాధి

ఎచ్చెర్ల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సాంకేతిక నైపుణ్యంతోనే మెరుగైన ఉపాధి అవకాశాలు పెంచుకోవచ్చని బ్రెయిన్ ఓ విజన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ (హైదరాబాద్) రిసోర్స్ పర్సన్ సాయి పవన్ అన్నారు. శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు 'డేటా స్ట్రక్చర్ అండ్ అల్గోరథ్స్ విత్ పైతాన్' అంశంపై పది రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా సర్టిఫికేట్లు పొందిన విద్యార్థులకు అమెజాన్, బోస్, గూగుల్ తదితర కంపెనీల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీటీ చంద్రశేఖర్, హెచ్‌వోడీ ప్రదీప్, టీపీవో బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాన్ని తొలగించండి

ఇచ్ఛాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బస్టాండ్ జంక్షన్ వద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీని ఆనుకుని ఆటో యూనియన్ సభ్యులు అక్రమంగా షెడ్ నిర్మాణం చేపడుతున్నారని, తక్షణం తగు చర్యలు తీసుకోవాలని ఎస్ఎంసీ చైర్‌పర్సన్ ఆశి లత మునిసిపల్ కార్యాలయ ఇన్‌చార్జి జానకిరావుకు వినతిపత్రం అందించారు. గతంలోనూ షెడ్ నిర్మిస్తే మునిసిపల్ అధికారులు తొలగించారని, ప్రస్తుతం మరలా పనులు చేపడుతున్నారని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. గోడను ఆనుకుని బాలికల టాయిలెట్స్ ఉన్నాయని, దీనివల్ల వారు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. తక్షణం షెడ్ నిర్మాణాన్ని తొలగించాలని కోరారు.

## 'ఉద్యమ్' రిజిస్ట్రేషన్‌తో పరిశ్రమలకు పోత్సాహం

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): 'ఉద్యమ్'లో రిజిస్ట్రేషన్ చేసుకున్న చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు వస్తాయని డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ తెలిపారు. స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ బ్యాంకు సహకారంతో జిల్లా మహిళా సమాఖ్యలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంతవరకు రిజిస్ట్రేషన్ చేయని పరిశ్రమలకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం అందించడమే లక్ష్యమన్నారు. అర్హత, ప్రమాణాలైన పెట్టుబడి పరిమితులు, టర్నోవర్ వివరాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు విధానం, అవసరమైన డాక్యుమెంట్లు, ధ్రువీకరణ ప్రక్రియ తదితర అంశాలపై నిపుణులు వివరించారు. సమావేశంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్, పరిశ్రమల శాఖ ఐపీఓ కిరణ్, డీపీఎంలు, ఇతర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బాట్లింగ్ యూనిట్‌ను విభజించొద్దని సీఎంకు లేఖ

ఎచ్చెర్ల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని బేవరేజస్ కార్పొరేషన్ పరిధిలోని నిర్వహిస్తున్న బాట్లింగ్ యూనిట్‌ను విభజించవద్దని కోరుతూ సీఎం నారా చంద్ర బాబునాయుడుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాసినట్టు ఆ పార్టీ జిల్లా నేతలు ఒక ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్లలో సొంత గొడౌన్ ద్వారా మద్యం సరఫరా చేస్తుంటే, అదనంగా టెక్కలిలో అద్దెకు తీసుకుని గొడౌన్‌ను కొత్తగా ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం లేదన్నారు. గతంలో ఎచ్చెర్లకు చెందిన దళితులు వారి చెందిన భూములను బాట్లింగ్ యూనిట్ ఏర్పాటుకు అప్పగించారని, నేడు ఈ డిపోను విభజించి దళితులు పొట్టకొట్టొద్దని విన్నవించారు.

### మోకాళ్లపై నిల్చుని నిరసన

ఎచ్చెర్ల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని బాట్లింగ్ యూనిట్‌ను విడదీయొద్దని హమాలీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆందోళనల్లో భాగంగా సోమవారం మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ.. టెక్కలిలో కొత్తగా డిపోను ఏర్పాటు చేసి, ఇక్కడి హమాలీలకు అన్యాయం చేయడం సబబుకాదన్నారు. కార్యక్రమంలో హమాలీల యూనియన్ నాయకులు డి.బంగార్రాజు, టి.రామారావు, నిడిగింట్ల రమణ, ఎం.సురేష్, బోనెల రాము, లింగాల రాము పాల్గొన్నారు.

# ఆరుబయట సైకిళ్లు..

- ఎండకు ఎండి వానకు తడిచి.. ● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- షెడ్లు ఏర్పాటు చేయాలని వినతి



గార: జడ్పీ పాఠశాల ఆవరణలో చెట్ల కింద ఉన్న సైకిళ్లు



సోంపేట రూరల్: మామిడిపల్లి స్కూల్ గేటు ముందు ఉన్న సైకిళ్లు

గార/సోంపేట రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాల నుంచి పాఠశాలలకు వచ్చి చదువుకునే విద్యార్థులు ఎక్కువగా సైకిళ్లపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అయితే పాఠశాలల్లో షెడ్లు లేకపోవడంతో ఆరుబయటే సైకిళ్లను ఉంచాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీంతో ఎండకు ఎండి, వానకు తడిచి సైకిళ్ల గాలి పోయి, తుప్పు పట్టి పాడవుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి గార, సోంపేట మండలం మామిడిపల్లి జడ్పీ హైస్కూళ్లలో నెలకొంది. పాఠశాలల ఆవరణలో ఆరుబయటే సైకిళ్లను ఉంచుతున్నారు. గార పాఠశాలకు బూరవెల్లి, పూసర్లపాడు, శాలిహుండాం, తూలుగు, కుమ్మరిపేట, బోరవానిపేట, ఆరంగిపేట, ఎస్‌డీఎస్‌పేట తదితర గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థిని విద్యార్థులు రోజూ సైకిళ్లపై వస్తున్నారు. ఈ రూట్‌లో పాఠశాల సమయానికి తగినన్ని బస్సులు లేకపోవడంతో విద్యార్థినీ విద్యార్థులు సైకిళ్లపైనే వస్తున్నారు. సోంపేట మండలం మామిడిపల్లి, ఎర్రముక్కాం పాఠశాలల్లోని పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల ఆవరణల్లో సైకిళ్లను నిలిపేందుకు షెడ్లను ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## చోరీ కేసులో ఐదుగురిపై కేసు

రణస్థలం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల రెడ్డీస్ పరిశ్రమలో బ్యాటరీలు చోరీ చేసిన గురి, గణేష్, సన్యాసప్పడులను అరెస్ట్ చేసి మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. వారి నుంచి బ్యాటరీలను రికవరీ చేసినట్లు పేర్కొన్నారు.

## మలేరియా నివారణకు చర్యలు



దోమల నియంత్రణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో ప్రజలు జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సాహితీ ప్రియదర్శిని అన్నారు. వెన్నెలవలస గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. మలేరియా దోమల నివారణకు గాను 11 ఇళ్ల పరిసరాల్లో సైపెనోత్రిన్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీఎంహెచ్‌వో, జిల్లా మలేరియా నివారణాధికారి ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల్లో మలేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇళ్లతో పాటు గ్రామ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మోహన్ రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


## తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



అవగాహన కలిగిస్తున్న డా.దేవేంద్ర రెడ్డి

ఇచ్ఛాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం సిద్ధిస్తుందని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పాతిర్ల దేవేంద్ర రెడ్డి అన్నారు. తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా సోమవారం సీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిపాలలో విశేష పోషకాహార గుణాలుంటాయని, పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా పాలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శిల్ప, నెహ్రూ యువ కేంద్ర ప్రతినిధి బెహరా తదితరులు పాల్గొన్నారు.

## 950 కిలోల బియ్యం స్వాధీనం



పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

సోంపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పలాసపురంలో అక్రమంగా నిల్వ చేసిన 950 కిలోల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన గార అప్పన్న రేషన్ కార్డుదారుల వద్ద కొనుగోలు చేసిన 950 కిలోల బియ్యాన్ని ఇంటి వద్ద నిలువ ఉంచగా విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామారావు ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్‌కుమార్, వీఆర్వో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతో రోడ్లకు మోక్షం: ఎన్ఈఆర్



రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

లావేరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం హయాంలోనే గ్రామీణ రోడ్లకు మోక్షం కలుగుతోందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. సోమవారం పెదలింగాలవలసలో 'నమస్తే ఎచ్చెర్ల' కార్యక్రమం నిర్వహించారు. వెంకటాపురం జంక్షన్ నుంచి పెదలింగాలవలస మీదుగా పోతాయవలస వరకు నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. గ్రామంలో నిర్మించిన 12 సీసీ రోడ్ల ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో సామాజిక భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటానన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామీణ రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పోతాయవలస నుంచి అదపాక రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మించనున్నా మన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, టీడీపీ మండల అధ్య క్షుడు ముప్పిడి సురేష్, బీజేపీ అధ్యక్షుడు లుకలాపు అప్పలనాయుడు, సర్పంచ్ లుకలాపు యశోద పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు

శ్రీకాకుళం లీగల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వం దోహదపడుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 90 రోజుల మీడియేషన్ డ్రైవ్‌లో భాగంగా సోమ వారం మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వ న్యాయవాదులు కక్షిదారులకు అనుకూలంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తంగి శివ ప్రసాద్, పిట్టా దామోదర్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్ వైఫల్యాన్ని మోదీ అంగీకరించాలి

- ట్రంప్ పాదాల చెంత వీర సైనికుల త్యాగాలు
- కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి



మాట్లాడుతున్న కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి

అరసవల్లి ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ వైఫల్యాన్ని ప్రధాని మోదీ అంగీక రించాలని కేంద్ర మాజీ మంత్రి డా.కిల్లి కృపారాణి డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరా విజ్ఞాన భవనంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. లోక్‌సభ, రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరిగిన తీరు దారుణమన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ పనితీరు వల్ల ప్రపంచ దేశాల్లో దేశ ప్రతిష్ఠ దిగజారి పోయిందని విమర్శించారు. మన వీర సైనికుల ప్రాణ త్యాగాలను ట్రంప్ పాదాల చెంత ఉంచారని ఆరోపించారు. దేశ రక్షణ, ఆర్థిక, విదేశాంగ విధానాలతో ప్రపంచ దేశాల ముందు తలదించుకునే పరిస్థితి దాపురించిందన్నారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ ప్రశ్నలకు సమాధానం చెప్పడం చేత కాక, నెహ్రూ, ఇందిరాగాంధీ పేర్లను ప్రస్తావించడం హాస్యాస్పదమన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులను ఎందుకు తీసుకురాలేకపోతున్నారో సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. నిజానికి రాష్ట్రంలో ఉన్నది కూటమి ప్రభుత్వం కాదని, టీడీపీ ప్రభుత్వమని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్కడున్నారు.. ఏం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. ఒకరు అధికారంలో ఉంటే వేరొకరిని జైళ్లకు పంపించడం ఒక సంప్రదాయంగా మార్చారని, అందుకే రాష్ట్రంలోని జైళ్లను ఆధునికీకరించాలని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్, జీవీ త్రినాథరావు, కిల్లి రామ్మోహన రావు, రాంగోపాల్, దేశిల్ల మల్లిబాబు పాల్గొన్నారు.

## 27 నెలలుగా సీఆర్పీ గైర్హాజరు

- లోలుగు క్లస్టర్ పాఠశాలలకు ఇబ్బందులు

పొందూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): లోలుగు క్లస్టర్ సీఆర్పీ (సీఎంఆర్టీ)గా కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఉషాబాల 27 నెలలుగా విధులకు గైర్హాజరయ్యారు. మండల విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడంతో క్లస్టర్ పరిధిలోని పాఠశాలలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వివరాలిలా ఉన్నాయి.. ఉషాబాల 2023 మే నెలకు ముందు కొన్ని రోజులు మెడికల్ లీవ్ పెట్టారు. ఆ తరువాత ఎటువంటి సెలవు పెట్టకుండా విధులకు డుమ్మా కొట్టారు. 27 నెలలుగా అధికారులకు ఎటువంటి సమాచారం లేకుండా సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరైనా కనీస చర్యలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చాలా యాప్‌లు, విధులు సీఆర్పీలు(సీఆర్ఎంటీ)లే నిర్వహిస్తారు. అటువంటి సీఆర్పీ లేకపోవడంతో లోలుగు క్లస్టర్ పరిధిలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విధులు వేరే క్లస్టర్ సీఆర్పీకి మండల విద్యాశాఖాధికారులు అప్పగించినప్పటికీ రెండు మండలాల్లో విధుల్లో బాధ్యతల భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో-2 పి.రాజారావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా లోలుకు సీఆర్పీ 27 నెలలుగా గైర్హాజరైన విషయం వాస్తవమేనన్నారు. ఈ విషయాన్ని ఎస్ఎస్ ఏ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, నోటీసులు పంపేందుకు ప్రయత్నించినా సదరు సీఆర్పీ అడ్రస్ తెలియరా లేదన్నారు. కొత్త సీఆర్పీ నియామకంపై ఎస్ఎస్ఏ అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం: ఏఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ కేవీ రమణ

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల చట్టం పరిధిలో ప్రజలు చేసుకున్న వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఏఎస్పీ కేవీ రమణ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 48 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అర్జీలను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక అందించాలన్నారు.

## తలసేమియా బాధిత విద్యార్థికి సాయం

ఆమదాలవలస, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న సీహెచ్ రంజిత్ కొన్ని నెలలుగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. విద్యార్థి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని అధ్యాపకులు రూ.1.66 లక్షలు సేకరించారు. ఈ మొత్తాన్ని సోమవారం రంజిత్ కుటుంబ సభ్యులకు ప్రిన్సిపాల్ బి.శ్యాంసుందర్ తదితరులు అందజేశారు.



విద్యార్థి కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న అధ్యాపకులు

## ఘనంగా సామూహిక సీమంతాలు

ఎచ్చెర్ల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా చిన కొంగరాంలో డోకి కమల, భద్రాచలం సహకారంతో సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. మందిరం కన్వీనర్ వెలిచేటి తవిటిరాజు, బెజ్జిపురం యూత్ క్లబ్ డైరెక్టర్ ప్రసాదరావు, జిల్లా సమన్వయకర్త పి.నాగేశ్వరరావు, పెద్ద మందిరం కన్వీనర్ కంభం మురళి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, ఉషారాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.



సామూహిక సీమంతాలు దృశ్యం

### న్యూస్ బాక్స్

#### వైసీపీ తప్పుడు ప్రచారం మానుకోవాలి

ఆమదాలవలస, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వీటిని మానుకోవాలని కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ హితవు పలికారు. సోమవారం తొగరాం పంచాయతీలో కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. అలాగే రొట్టవలస, కొండవలస గ్రామాల్లోనూ వితంతు పింఛన్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో పలువురు తెలుగుయువత నేతలు పాల్గొన్నారు.

#### వితంతు పింఛన్ల పంపిణీ

పొందూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా మంజూరైన 223 వితంతు పింఛన్లను ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాలతో సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి, మాజీ ఎంపీపీ కూన ప్రమీల, కూటమి నేతలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

#### ఏడు ద్విచక్ర వాహనాలు సీజ్

గార, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గారలో సోమవారం ఎస్ఐ సీహెచ్ గంగరాజు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని ఏడు ద్విచక్ర వాహ నాలను సీజ్ చేశారు. ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటా మన్నారు. అపరిచితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

#### ఎంఈవో-1 (ఎఫ్ఏసీ)గా రాములు

ఆమదాలవలస, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎంఈవో-1గా ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కేఏ రాములు అదనపు బాధ్యతలను సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఈవో టింగరాజు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ తదితరులు అభినందించారు.

#### జేఎల్‌పీఎం ఫీజు మినహాయింపు

ఇచ్ఛాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జాయింట్ ఎల్‌పీఎంల కోసం ఆన్‌లైన్‌లో సబ్ డివిజన్ సేవల కోసం స్వీకరించిన అన్ని దరఖాస్తులకు 6 నెలలకు ఫీజు మినహాయింపునిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తహసీల్దార్ ఎన్.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. రీసర్వే అయిన గ్రామాల్లో రైతులందరూ ఈ విషయాన్ని గమనించి కేవలం రూ.50 చెల్లించి జాయింట్ ఎల్‌పీఎంలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

#### అర్హులందరికీ ఇళ్లు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అర్హులందరికీ హౌసింగ్ ఫర్ ఆల్ పథకంలో పక్కా ఇళ్ల నిర్మా ణానికి వీలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దీనినిమిత్తం ఇంటి స్థల పట్టాలను ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేసిందని తహసీల్దార్ ఎన్.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లు లేని వారికి గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థల ఎక్స్‌టెంట్ ఉన్న గృహ పట్టా మహిళా లబ్ధిదారుల పేరిట ఇవ్వడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు బీపీఎల్ కేటగిరిలో ఉండాలని, తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి గతంలో ప్రభుత్వ పథకంలో స్థలం పట్టా పొందని వారు మాత్రమే అర్హులని ఆ ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, శ్రీకాకుళం : 9985411535
రాజాం : 9494691912, పలాస : 9985411532



ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

క్రైం కార్నర్

## మహిళ అనుమానాస్పద మృతి


సూర్యకాంతం (ఫైల్)

నరసన్నపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసనగర్‌లో అద్దెకు ఉంటున్న రిటైర్డు హెల్త్ ఉద్యోగిని రాముల సూర్యకాంతం (62) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాకివలస పీహెచ్‌సీలో సీఈవోగా పనిచేసి జూన్‌లో పదవీ విరమణ పొందిన సూర్యకాంతం శ్రీనివాసనగర్‌లో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఆ ఇంటి నుంచి ఆదివారం రాత్రి దుర్వాసన రావడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపులు తెరచి చూశారు. ఆమె ఇంట్లో విగతజీవిగా పడి ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయమై పెంపుడు కుమార్తె జ్యోషిత ఫిర్యాదుతో సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించామని ఎస్‌ఐ చెప్పారు. అనారోగ్యంతో సూర్యకాంతం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

**చికిత్స పొందుతూ వ్యక్తి..**

నరసన్నపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గోపాలపెంట గ్రామానికి చెందిన బండి రాజారావు (50) శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల ఒకటో తేదీన రాజరావు గడ్డి మందు తాగడంతో కుటుంబ సభ్యులు శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు భార్య సరస్వతి ఫిర్యాదు చేసినటు తెలిపారు. రాజారావుకు ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఆయన మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు

పలాస, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఎమ్మెల్యే శిరీష పదేపదే దూషిస్తున్నారని... దీనివల్ల తమ మనోభావాలు దెబ్బతిన్నాయని, దీనిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు సోమవారం మధ్యాహ్నం కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో శిష్టు గోపి, బత్తిన హేమేశ్వరరావు, ఉంగ సాయికృష్ణ, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, డి.దానయ్య, గుజ్జు జోగారావు ఉన్నారు.

## గంజాయి తరలింపుపై కేసు నమోదు

ఆమదాలవలస, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సారంగడోల వీధికి చెందిన శిరిగిడి శ్రీనివాసరావు, కటమల తరుణ్ కుమార్, బొబ్బాది మణికృష్ణ, వంజరాపు భార్గవ్, ఫరీదఖాన్, జలగడుగుల ప్రసాద్ అనే వ్యక్తులను అరెస్టు చేసి. 15 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ సనపల బాలరాజు సోమవారం తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

## రేషన్ డిపోలపై 6ఏ కేసులు నమోదు

నందిగాం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు రేషన్ డిపోల్లో విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో సరుకులు తేడా ఉండడంతో కేసులు నమోదుచేశారు. ఈ మేరకు సోమవారం కొత్తగ్రహారం, నందిగాం-1 డిపోల్లో విజిలెన్స్ ఎస్‌ఐ బి.రామారావు నేతృత్వంలో తనిఖీలు చేపట్టారు. కొత్తగ్రహారం డిపోలో 529 కిలోలు బియ్యం రికార్డులు కంటే అధికంగా ఉన్నట్టు గుర్తించారు. నందిగాం-1 డిపోలో వంద కిలోల బియ్యం తక్కువగా ఉండడంతో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సీఎస్‌డీటీ అనిల్‌కుమార్ పాత్రో, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

## దూషించడం తగదు

పలాస, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పత్రికల్లో ఆరోపణలు వస్తే ఖండించాలే గానీ తనపై దూషణలు చేయడం ఎమ్మెల్యే శిరీషకు తగదని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం జీఎంఈ కాలనీలోని తన కార్యాలయం ప్రగతి భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే వ్యాఖ్యల పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తన జోలికి వస్తే సహించనన్నారు. పశువు, సైకో అంటూ ఇష్టమొచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. నల్లబొడ్లూరు, ఉజ్జుడుకొండపై తన చేస్తున్న ఆరోపణలపై చర్చకు సిద్ధంగా ఉన్నానని ఆయన తెలిపారు.

## రేపు 'ఎత్తిపోతల'కు విద్యుత్ అంతరాయం

కోటబొమ్మాళి, ఆగష్టు 4 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా చిన్నసాన ఎత్తుపోతల పథకానికి, వ్యవసాయ విద్యుత్‌కు ఉదయం బుధవారం 8 మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టెక్కలి విద్యుత్ శాఖ ఈఈ నరసింహ కుమార్ తెలిపారు. రైతులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

## చెట్టుకొమ్మలు తొలగించండి

వజ్రపుకొత్తూరు, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): బాతుపురం నుంచి చినవంక వరకు గల ఆర్‌అండ్‌బీ రోడ్డు పైకి జీడిచెట్టు కొమ్మలు ముందుకు రావడంతో ప్రమాదాలకు గురవుతున్నట్లు బాతుపురం సర్పంచ్ బత్తిని లక్ష్మీనారాయణ సోమవారం గ్రీవెన్స్‌లో ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని పేర్కొన్నారు. అలాగే పూడి జగన్నాథపురం పంచాయతీకి సంబంధించి వీధి దీపాలు వేయాలని సచివాలయ జెల్‌ఎంకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదని తెలిపారు. దీంతో రాత్రి వేళల్లో చీకటిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక సర్పంచ్ ప్రసాద్ గ్రీవెన్స్‌లో ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు.

## రోడ్డు పనుల పరిశీలన

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కొండవూరు పంచాయతీ పరిధిలో ౧నిర్మాణంలో ఉన్న సిమెంటు రోడ్డు పనులును ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు సోమవారం పరిశీలించారు. కూటమి ప్రభుత్వం గ్రామాలలో పూర్తిస్థాయి సిమెంటు రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యులు నూల చిట్టిబాబు, మాజీ సర్పంచ్ కొల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 69 మందికి కంటివైద్య పరీక్షలు

పాతపట్నం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 69 మందికి కంటిపరీక్షలు నిర్వహించినట్లు క్యాంప్ ఇన్‌చార్జ్ టి.రామారావు తెలిపారు. జిల్లా అంధత్వ నిర్మూలనా సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. 39 మందికి కంటిశస్త్ర చికిత్సలు చేయాల్సి ఉందని తెలిపారు.

## డిసెంబరు నాటికి ఇళ్లు పూర్తి చేయాలి

టెక్కలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంతి ఆవాస్ యోజన కింద 2019-24 మధ్యలో మంజూరై... వివిధ దశల్లో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణానిన డిసెంబరు 31 నాటికి పూర్తి చేయాలని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్(సీఎల్‌టీసీ) చెన్నూరు మల్లేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ దశల్లో ఆగిపోయిన ఇళ్లకు ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, ఆదివాసీ గిరిజనులకు రూ.లక్ష అదనపు సాయం అందించినట్టు తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు చేయకపోతే పట్టాలు రద్దు చేస్తామని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే తన ఫోన్ నెంబరు 9949256501కు సంప్రదించాలని సూచించారు.

# మొరాయిస్తున్న ఫోన్లతో పనిచేయలేం

● మాన్యువల్‌గానే సరుకులు పంపిణీ చేస్తాం ● అంగన్‌వాడీ యూనియన్ నాయకుల స్పష్టీకరణ ● అధికారులకు తిరిగి ఇచ్చేసిన వైనం


అరసవల్లి: ఫోన్లతో పని చేయలేమని అంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


కొత్తూరు: నిరసన ప్రదర్శనలో పాల్గొన్న కార్యకర్తలు

అరసవల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మొరాయిస్తున్న ఫోన్లతో ఇక పనిచేయలేమని, రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఆ ఫోన్లను తిరిగి ఇచ్చేస్తున్నామని సీఐటీయూ అనుబంధ సంఘం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కల్యాణి, సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు అన్నారు. ఈ మేరకు స్థానిక అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పీవోకు సోమవారం తమ ఫోన్లను అందజేయడంతో పీవో మాకు ఎటువంటి ఆదేశాలు లేవని వాటిని తీసుకునేందుకు నిరాకరించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. సమస్య పరిష్కారం కానంతవరకు ఆన్‌లైన్ వర్క్ చేయలేమని, మాన్యువల్‌గా, రికార్డు ద్వారానే ు అందిస్తామన్నారు, అధికారులు ఒత్తిడి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. తమ ఫోన్లను కార్యాలయంలోనే విడిచిపెట్టారు. ప్రధానమంత్రి మాతృ వందనం పథకాన్ని అంగన్‌వాడీలకు అప్పగించవద్దని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. యాప్‌లు సరిగా పనిచేయడం లేదని, దీనివల్ల సరుకుల పంపిణీ సాధ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.రాజేశ్వరి, కె.జ్యోతి, సంధ్యారాణి, అంజలీభాయి, పద్మజ, పుష్పలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తమ ఫోన్లను సంబం ధిత సిబ్బందికి అందజేశారు. నెట్‌వర్క్ లేని ఫోన్లతో పనిచేయలేమని, యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు.


ఎచ్చెర్ల: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


పలాస రూరల్: సెల్‌ఫోన్లను బాక్స్‌లలో పెట్టి ఇచ్చేస్తున్న కార్యకర్తలు


టెక్కలి: మొబైల్ ఫోన్లతో నిరసన తెలుపుతూ..

## వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి: ఎమ్మెల్యే శిరీష


వైద్యాధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

మందస, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసిబ్బంది ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉండాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ సమస్యలపై వైద్యాధికారి మౌనికను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మౌలిక సదుపాయాల కొరత ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పరిశీలనలో ఆమెతో పాటు టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, భావన దుర్యోధన, జనసేన నాయకుడు సంతోష్‌పండా, ఇతర నాయకులు ఉన్నారు.

**కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం**

పలాస రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సున్నాదేవి గ్రామంలో సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఆగస్టు 15 నుంచి మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే వీలు కల్పిస్తున్నామన్నారు. ఇంటింటికి కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్, మండల టీడీపీ అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణకుమార్, పీఏసీఎస్ చైర్మన్ వంకల కూర్మారావు, నాయకులు పోలాకి పాపారావు, కుమారరాజా, మహిళలు పాల్గొన్నారు. తర్లాకోటలో పీఏసీఎస్ చైర్మన్ వంకల కూర్మారావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు.

## వీఆర్‌ఏ దుర్గారావుపై విచారణ


విచారణ చేపడుతున్న తహసీల్దార్ ఈశ్వరమ్మ

ఎల్.ఎన్.పేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బొర్రంపేట గ్రామానికి చెందిన వీఆర్‌ఏ ఎస్.దుర్గారావుపై తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ సోమవారం స్థానిక సచివాలయంలో విచారణ చేపట్టారు. గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో ఒకరి పేరున ఉన్న భూమిని ఇంకొకరిపేరున వీఆర్‌ఏ మార్చినట్లు (టాంపరింగ్) చేసినట్లు అదే గ్రామానికి చెందిన కె.శ్యామసుందరరావు ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టినట్టు తహసీల్దార్ ఈశ్వరమ్మ తెలిపారు శ్యామసుందరరావు నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందించనున్నట్టు తెలిపారు. విచారణలో ఆర్‌ఐ ఎస్.గవరయ్య, సర్వేయర్ బి.రామగణపతి, వీఆర్వోలు కె.జోగినాయుడు, దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో ఐక్యత సాధ్యం: ఎమ్మెల్యే బగ్గు


పాలపోలమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు (సారవకోట), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే గ్రామాల్లో ఐక్యతతో పాటు అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మదనాపురం గ్రామంలో పాలపోలమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఆలయాలను నిర్మించి భక్తిభావం పెంపొందించుకోవాలన్నారు. అనంతరం గ్రామదేవత పాలపోలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, సారవకోట సొసైటీ అధ్యక్షులు సురవరపు తిరుపతిరావు, మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, టీడీపీ నాయకులు సాధు చిన్నికృష్ణంనాయుడు, పిట్ట అప్పారావు, కోనారి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

**సీఎం సహాయనిధి చెక్కు అందజేత**

పోలాకి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గుల్లవానిపేట గ్రామానికి చెందిన కొమరసాయికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితునికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి నిధులు మంజూరయ్యాయి. సోమవారం బాధత కుటుంబ సభ్యులకు రూ2.98,582 చెక్కును మబగాం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి అందచేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త బగ్గు అర్చన, పార్టీ అధ్యక్షులు ఎం.వి.నాయుడు, పిఏసీఎస్ అధ్యక్షులు బైరిబాస్కరరావు, దాసరి తవిటయ్య, నందుపల్లి దండాసి, కోడ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్**

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే మబగాంలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి సూచించారు. అర్జీలను పరిశీలించి పరిష్కార మార్గం చూస్తామన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకూడదు: ఎమ్మెల్యే


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పాతపట్నంలో తాగునీటి సమస్య తలెత్తకూడదని... దీనికి ఏం చేయాలో అధికారులే చెప్పాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పిల్లివీధి, శివశంకర్ కాలనీ, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందని అన్నారు దీనికి అవసరమైన నిధులు ప్రభుత్వ నుంచి మంజూరు చేయిస్తానని... మరోసారి ఫిర్యాదులు రాకుండా ఉండాలని సూచించారు. పిల్లివీధికి కొత్తకనెక్షన్లు ఇవ్వాలని సూచించారు. శివశంకర్ కాలనీ తదితర పారంతాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి డేగలకొండపై ట్యాంక్ నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పైల బాబ్జీ, సైలాడ సతీష్, శ్రీరాం దుర్గాప్రసాద్, అక్కుంద్ర సన్యాసిరావు, ఎస్.ప్రభాకరరావు, ఈవో ఊన రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజును ఆయన స్వగృహంలో కలిసిన ఎమ్మెల్యే గోవిందరావు..శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థులు మంచి మార్గంలో పయనించాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి రాణి

కొత్తూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉన్నత చదువులపై దృష్టి సారించి మంచి మార్గంలో పయనించాలని కొత్తూరు కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయ సేవా సంఘ అధ్యక్షులు కందికట్ల రాణి సూచించారు. సోమవారం కుంటిబద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ప్రణాళికలతో ముందుకు సాగాలని సూచించారు. బాల్య వివాహాల నిరోధించేందుకు కృషి చేయాలని కోరారు. ర్యాగింగ్ వంటివి చేసి బంగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు బార్ అసోసియేషన్ సభ్యులు రాడ రాజు, అరుబోలు దశరథరావు, ప్రసాద్, జానకిరామ్, రమేష్, హెచ్‌సీ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆశాలపై వేధింపులు ఆపండి


వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

కాశీబుగ్గ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ఏఎన్‌ఎంలు తమపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ పీహెచ్‌సీ అధికారులకు ఆశా కార్యకర్తలు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి మాట్లాడుతూ ఆశాలకు అదనపు పనులు అప్పగిస్తూ వేధించడం తగదన్నారు. ఏఎన్సీ టార్గెట్లు విధించడం, వ్యాక్సిన్ కిట్లు తెమ్మని ఒత్తిడి చేయడం, అదనపు సర్వేల వంటివి చెబితే చేయలేమని సమాధానమిస్తే దుర్భాష లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సబిత పాత్రో, లక్ష్మి, జ్యోతి, పుణ్యవతి, స్వాతి, సుందరి తదితరులు పాల్గొన్నారు.

## యోగా పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

పోలాకి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలో ఇటీవల నిర్వహించిన యోగా పోటీల్లో ఈదులవలస మోడల్ స్కూల్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని ప్రిన్స్‌పాల్ పైడి ప్రవీణ, పీడీ ఎం.నీలం తెలిపారు. సోమవారం ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ పోటీల్లో ఎం.భారతి బంగారు పతకం, జి.యశస్విని, జె.శరణ్య రజత పతకాలు సాధించారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు, అధ్యాపకులుం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శివదీక్షను విరమించిన భక్తులు


శివదీక్షను విరమింపజేస్తున్న శివస్వాములు

జలుమూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధిచెందిన శ్రీముఖలింగేశ్వరస్వామి సన్నిధిలో సోమవారం ఒడిశాకు చెందిన శివ భక్తులు దీక్షను విరమించారు. కటక్, భువనేశ్వర్‌కు చెందిన శివ భక్తులు ముందుగా పవిత్ర వంశధార నదిలో స్నానాలు ఆచరించి శ్రీముఖలింగేశ్వరాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి వంశధార నదీజలాలతో స్వామి వారికి అభిషేకాలు చేశారు. అనంతరం శివదీక్షను విరమించారు. వంశధార నదీ జలాలను తీసుకొని వెళ్లి రావివలస ఎండల మల్లికార్జునస్వామికి జలాభిషేకం చేయనున్నట్టు శివస్వాములు తెలిపారు.

## త్వరలో సమస్యలు పరిష్కరిస్తా:ఆర్డీవో

పాతపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన వినతులను వారం రోజుల్లో పరిష్కరిస్తామని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా మ్యుటేషన్లకు సంబంధించి వినతులు అందాయని ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

**రేపు నీలమణిదుర్గ హుండీల లెక్కింపు**

స్థానిక శ్రీ నీలమణిదుర్గ ఆలయంలోగల హుండీలను బుధవారం ఉదయం10 గంటలకు లెక్కిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి టి.వాసుదేవరావు తెలిపారు.

## నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు జర్మన్ భాషపై శిక్షణ

హిరమండలం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు జర్మన్ బాషపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఎం.అన్నాదొర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారు ఈ నెల ఏడో తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. యూరప్ దేశాల్లో నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు చాలా ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. జర్మన్ భాష నేర్చుకునేందుకు ఎనిమిది నుంచి పది నెలల పాటు విశాఖపట్నంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. వివరాలకు శ్రీకాకుళంలోని గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకుల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## తల్లిపాలతోనే పిల్లలకు ఆరోగ్యం

నరసన్నపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తల్లిపాలతోనే పిల్లలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని దీనిపై అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని పీవో శోభారాణి సూచించారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా సోమవారం మడపాంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ ఎరుకువాడు, ఎమ్పీటీసీ సభ్యులు రుప్ప వాసుదేవరావు పాల్గొన్నారు.